క్లుప్తంగా

వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రవీణ్ కుమార్

వాంకిడి: ఉపాధిహామీ కూలీలకు వసతులు కల్పించాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. జాబ్‌కార్డు దారులకు వంద రోజులు పని కల్పించాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలపై దృష్టి సారించాలని, పనులు నిరంతరం కొనసాగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో ఖాజా అజీజుద్దీన్, ఏపీవో శ్రావణ్ కుమార్, ఈసీ మోసిన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు జ్యూస్ పంపిణీ



జ్యూస్ పంపిణీ చేస్తున్న ఎస్సై

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద పదో తరగతి పరీక్ష రాస్తున్న విద్యార్థులకు ఎస్సై కొమురయ్య బుధవారం జ్యూస్ పంపిణీ చేశారు. ఎండలు మండుతున్న నేపథ్యంలో విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు ఉన్నారు.

విద్యార్థులకు సన్మానం



విద్యార్థిని సన్మానిస్తున్న ఎంఈవో

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థుల ప్రయోజకులు కావాలని ఎంఈవో సుభాష్ అన్నారు. బుధవారం తన కార్యాలయంలో నవోదయకు ఎంపికైన విద్యార్థులను సన్మాంచారు. జిల్లా కేంద్రంలోని హోలీ ట్రినిటీ పాఠశాలలో చదువుతున్న నాగపూరి మోహన్ దాస్ నీలిమా కుమారుడు వరుణ్, మండలంలో సింగరావు పేట పాఠశాలకు చెందిన ఎస్సం శ్రీకాంత్ ఆరో తరగతి ప్రవేశాలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

డిప్యూటీ ఆర్వో బదిలీ

కెరమెరి: మండలంలోని దేవాపూర్ సెక్షన్‌లో డిప్యూటీ రేంజ్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న నాగేశ్వర్‌గౌడ్ బాసర జోన్‌కు బదిలీ అయ్యారు. కాగా.. బుధవారం కార్యాలయంలో ఎఫ్ఆర్వో సయ్యద్ మజారోద్దీన్ శాలువాతో సత్కరించి, స్వీట్లు తినిపించారు. అడవుల సంరక్షణకు కృషి చేశారని అన్నారు.

ప్రత్యేక పరికరాలు పంపిణీ

వాంకిడి: ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు భవిత కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం స్టైఫండ్, ప్రత్యేక పరికరాలు పంపిణీ చేశారు. 11 మందికి ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు, పలువురికి స్టైఫండ్ మంజూరు చేశారు. మొదటి విడతలో భాగంగా రూ.1,17,760లు అకౌంట్‌లో జమ చేసినట్లు భవిత కేంద్రం నిర్వాహకురాలు డి. తిరుమల, ఉపాధ్యాయుడు ఉప్రె వినేష్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయలు శ్వేత, ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్‌అర్బన్: విద్యుత్ మరమ్మతుల పనుల్లో భాగంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు మండలంలోని గుండి జీపీలో పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ రూరల్ ఏఈ ఉర్మిల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అడవుల రక్షణకు కృషి చేయాలి

తిర్యాణి: జిల్లాలోని అడవుల రక్షణకు అటవీశాఖ అధికారులు కృషి చేయాలని డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ అన్నారు. బీట్ అధికారి అంబారావు ఉద్యోగ విరమణ సందర్భంగా మండల కేంద్రంలోని ఫారెస్టు రేంజ్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. డీఎఫ్‌వో మాట్లాడుతూ అడవుల రక్షణకు అంబారావు చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో తిర్యాణి రేంజ్ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణ కష్టాలు..!

- నిధులు లేక నిలిచిన వంతెన పనులు
- ఇబ్బంది పడుతున్న ఆదివాసీలు



నిర్మిస్తున్న వంతెన ఇదే..

కెరమెరి: వాగులు, వరదల వల్ల రాకపోకలకు ఇబ్బంది పడుతున్న గ్రామీణులను దృష్టిలో ఉంచుకొని గత ప్రభుత్వం మండలంలోని కర్రెతగూడ వెళ్లే దారిపై వంతెన మంజూరు చేసినా పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. నిధులు రాక పనులు జరగక ఎక్కడికక్కడే నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఫలితంగా ఆయా గ్రామాలకు చెందిన గిరిజనులకు ప్రయాణ కష్టాలు తప్పడం లేదు. వానలు కురిస్తే మళ్లీ కష్టాలు తప్పవంటూ.. ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాంగ్వి గ్రామ పంచాయతీకి చెందిన కర్రెతగూడ, రావుజీగూడ, రాంనగర్ గ్రామాల్లో సుమారు 300లకు పైగా జనాభా ఉంటుంది. ఆ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిపై వంతెన నిర్మిస్తున్నారు.

ఇప్పటికే రూ.1.30 కోట్లు..

ఎఫ్‌డీఆర్ (ఫ్లడ్ డ్యామేజీ రోడ్లు) పథకంలో భాగంగా పంచాయతీరాజ్ శాఖ రూ. 2.50 కోట్లు నిధులతో 2023 మేలో వంతెన మంజూరైంది. వెంటనే సంబంధిత కాంట్రాక్టర్ ఆ ఏడాదే జూలైలో 70 శాతం వరకు నిర్మాణం పూర్తి చేశారు. దీని నిర్మాణానికి రూ. 1.30 కోట్లు ఖర్చు చేశారు. కాని ఇంతవరకు చిల్లి గవ్వ ఇవ్వకపోవడంతో వంతెన నిర్మాణం నిలిచిపోయింది. అయితే ప్రభుత్వం విడుదల చేస్తామన్నా.. రూ.2.50 కోట్లు సరిపోవడం లేదని మరో రూ. 1.20 కోట్లను పెంచుతూ ప్రభుత్వానికి ఇంజినీరింగ్ అధికారులు గతంలోనే నివేదికలు అందించారు. కాని అసలుకే ఎసరు పెట్టిన ట్లు పెంచిన నిధులు అటుంచితే.. వెచ్చించిన నిధులు కూడా విడుదల కానీ పరిస్థితి. వంతెన నుంచి ఆయా గ్రామాలకు వెళ్లేందుకు ఐటీడీఏ ఆధ్వర్యంలో గతంలో బీటీ రోడ్డు మంజూరైంది. ఇంకా నిధులు విడుదల కాక పోవడంతో రోడ్డు పనులు నిలి చిపోయాయి. మారో నాలుగు నెలలు గడిస్తే వర్షకాలం ప్రారంభమవుతుంది. మళ్లీ రవాణా కష్టాలు తప్పవా అంటూ ఆదివాసీలు ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వం స్పందించాలి



ఎన్నో ఏళ్లుగా వంతెన లేక పోవడంతో అనేక కష్టాలు పడ్డాం. ఎన్నో వినతులు తర్వాత 2023లో ప్రభుత్వం వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. కాని నిధులు విడుదలలో జాప్యం జరుగుతుంది. ఇప్పటికీ 70 శాతం పనులు పూర్తయ్యాయి. నిధులు సరిపోక బిల్లులు అందక పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి.

– జగన్నాథ్‌రావు, మాజీ సర్పంచ్, సాంగ్వి

రివైజ్‌కు పంపించాం



గతంలో డిసైన్ లేకుండానే వంతెన మంజూరైంది. నానాటికీ పెరుగుతున్న స్టీల్ ధరలతో పాటు నాలుగు ఫిల్లర్లకు బదులు ఐదు ఫిలర్లు అయ్యాయి. ఇందుకు మరో రూ. 1.20 కోట్లు నిధులు పెంచాలని నివేదిక సమర్పించాం. పెంపుకు గల కారణాలను తెలపాలని ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు రావడంతో రివైజ్‌కు పంపించాం.

– క్రిష్ణ, పీఆర్‌డీ

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఉదయ్‌కుమార్

లింగాపూర్: సిర్పూర్ (యు) మండలానికి చెందిన తహసీల్దార్ ఉదయ్ కుమార్ లింగాపూర్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. దీంతో సిబ్బంది ఆయనను శాలువాతో సత్కరించారు. గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించాలని డిప్యూటీ తహసీల్దార్ పెద్దిరాజు, ఆర్ఐ ప్రదీప్‌లకు సూచించారు. తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న తహసీల్దార్

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

కౌటాల: మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయ 9వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా భక్తులు సాయినాథుని విగ్రహానికి అభిషేకం చేసి స్థానిక మార్కెట్ కాలనీ నుంచి ఆలయం వరకు పల్లకి సేవ నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు చంద్రశేఖర్, ఆలయ కమిటీ సభ్యులు చంద్రకళ, వొజ్జల మౌనిశ్, లహను, రాములు, వినాయక్‌గౌడ్, శైలేశ్, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న సీఐ రమేశ్

ఆసిఫాబాద్‌అర్బన్: విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని జైనూర్ సీఐ రమేశ్ అన్నారు. బుధవారం జైనూర్ కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు షీ టీం ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలపై హింస, ఈవిటీజింగ్, సైబర్ క్రైమ్‌లకు ఎవరైనా వెంటనే షీటీం, 100కు డయల్ చేయాలన్నారు. భరోసా టీం ఇన్‌చార్జి తిరుమల, షీటీం ఇన్‌చార్జి శిరీష మాట్లాడుతూ.. వ్యక్తిగత భద్రతకు సంబంధించి గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని, అదే విధంగా జిల్లాలోని మహిళలు రక్షణ కల్పించడం కోసమే షీటీంలు పని చేస్తున్నాయన్నారు. షీటీం సభ్యులు స్వప్న, శ్రీలత, భరోసా టీం న్యాయవాది శైలజ, ఏఎన్ఎం విజయ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్



రోడ్డుపై వాహనాల రద్దీ

- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పార్కింగ్ స్థలం కేటాయించాలని డిమాండ్

సిర్పూర్(టి): సిర్పూర్(టి) నియోజకవర్గ కేంద్రంలో వాహనాలు పార్కింగ్ ఇబ్బందిగా మారింది. సిర్పూర్(టి) పట్టణంలోని పోలీస్‌స్టేషన్ నుంచి బస్టాండ్ మీదుగా పేట్ మహెలా కాలనీ, డౌనల్ కాలనీ, గోవింద్‌పూర్ కాలనీల మీదుగా వెళ్లే ప్రధాన రహదారులకు ఇరువైపులా పార్కింగ్ లేక పోవడంతో వాహనదారులు, స్థానిక వ్యాపారస్తులు అవస్థలు పడుతున్నారు. బస్టాండ్ ప్రాంతంలో వ్యాపార సముదాయాలు ఉండడంతో అక్కడ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. ప్రధానంగా బస్టాండ్, డౌనల్ ప్రాంతాల్లో ట్రాఫిక్ అంతరాయం వాటిల్లుతుంది. గంటల తరబడి వాహనాలు ట్రాఫిక్‌లో ఇరుక్కొవాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికంగా రోడ్డు ప్రమాదాలు..

సిర్పూర్(టి) పట్టణంలోనే అధికంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో పలుమార్లు జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పలువురు మృత్యువాత పడిన ఘటనలు ఉన్నాయి. అయినా సిర్పూర్(టి) గ్రామపంచాయతీ పరిధిలో సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే స్థానిక ప్రజలకు, వాహనదారులకు పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. తప్పా.. ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడం లేదు.

ట్రాఫిక్‌కు అంతరాయం..

సిర్పూర్(టి) నియోజకవర్గంలోని పలు మండలాలకు వెళ్లే వాహనదారులు, అంతర్రాష్ట్ర రహదారుల గుండా మహారాష్ట్ర పట్టణాలకు ప్రయాణాలు సాగించే వాహనదారులు ట్రాఫిక్ సమస్యతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సిర్పూర్(టి) పట్టణం దాటాలంటే గంట సమయం పడుతుందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యకు పరిష్కరం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

పార్కింగ్ స్థలాలు కేటాయించాలి



సిర్పూర్(టి)లో ఉన్న బస్టాండ్ ప్రాంతంతో పాటు ప్రధాన రహదారుల గుండా పట్టణం దాటే వరకు ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. రోడ్లపై వాహనాలు నిలుపకుండా తగు చర్యలు తీసుకోవాలి. వాహనాలకు పార్కింగ్ స్థలాలు కేటాయించాలి.

– వినోద్, ట్రాలీ డ్రైవర్

చర్యలు తీసుకోవాలి



స్థానిక బస్టాండ్ ప్రాంతంలో, పేట్ మహెలా కాలనీ, డౌనల్ ప్రాంతాల్లో వాహనాలను ఇష్టారాజ్యంగా నడుపుతూ ట్రాఫిక్ అంతరాయానికి పాల్పడుతున్న వాహనదారులపై చర్యలు తీసుకోవాలి. పట్టణంలో ట్రాఫిక్ సమస్యతో పాటు బస్టాండ్ ప్రాంతంలో వ్యాపార సముదాయాల ముందు వాహనాలు నిలుపకుండా చూడాలి.

– మహేశ్

యువత క్రీడల్లో రాణించాలి

- ఏఎస్పీ(అడ్మిన్) ప్రభాకర్‌రావు
- కౌటాలలో ముగిసిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు



తలపడుతున్న తలాయి- కొంచవెల్లి జట్లు



తలాయి జట్టుకు బహుమతి అందిస్తున్న ఏఎస్పీ అడ్మిన్ ప్రభాకర్‌రావు, అధికారులు

కౌటాల: యువత క్రీడల్లో రాణించాలని ఏఎస్పీ(అడ్మిన్) ప్రభాకర్‌రావు అన్నారు. పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా కౌటాల పోలీస్‌స్టేషన్ మైదానంలో నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు బుధవారం రాత్రి ముగిశాయి. బెజ్జూర్ మండలం తలాయి, దహెగాం మండలం కొంచవెల్లి జట్లు ఫైనల్‌లో తలపడగా.. తలాయి జట్టు విజయం సాధించింది. విజేతకు రూ.20 వేలు, రన్నరప్‌కు రూ.15 వేలు, తిర్యాణి జట్టుకు రూ.10 వేల నగదుతోపాటు ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. యువత చెడు వ్యసనాలు, బెట్టింగ్‌లు, సైబర్ నేరాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీలు రామానుజం, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా పోటీలు

మారుమూల కౌటాల మండల కేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు ఆద్యంతం రసవత్తరంగా సాగాయి. ఈ పోటీల్లో 64 జట్ల నుంచి వందలాది మంది పాల్గొన్నారు. వీరికి ఉచిత భోజన వసతి ఏర్పాటు చేశారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడాపోటీలు క్రీడాఅవకాశాలను పెంచుతాయని పీఈటీలు పేర్కొన్నారు. క్రీడలపై యువతకు ఆసక్తి పెరుగుతుందని అభి

కౌటాలకు రావడం మొదటిసారి



జిల్లా కేంద్రంలో చాలాసార్లు పోటీల్లో పాల్గొన్నాం. కానీ కౌటాలకు రావడం ఇదే మొదటిసారి. పోటీల కోసం మూడు రోజులుగా కౌటాల పోలీస్ స్టేషన్‌లోనే ఉంటున్నాం. టోర్నీలో మా జట్టుకు మూడో బహుమతి వచ్చింది.

– బిర్సావ్, తిర్యాణి

రన్నరప్‌గా నిలిచాం



కౌటాలలో జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల ఏర్పాట్లు బాగున్నాయి. అలసట మర్చిపోయి పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నాం. ప్రాథమిక వైద్యచికిత్సకు ఏర్పాట్లు చేశారు. ఈ టోర్నీలో రన్నరప్‌గా నిలిచాం. పోలీస్ ఉన్నతాధికారుల చేతుల మీదుగా బహుమతులు తీసుకోవడం సంతోషంగా ఉంది.

– పురుషోత్తం, కొంచవెల్లి

ఉత్సాహంగా పాల్గొన్నాం



వాలీబాల్ క్రీడాకారులకు జిల్లాస్థాయి పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉంది. మాతోటి క్రీడాకారులంతా పోటీలు ఆస్వాదించారు. కళాశాల తరుపున సౌత్ జోన్ వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నా. దివ్యాంగుడినైన నా ఆట చూసి కౌటాల సీఐ రమేశ్ రూ.2 వేలు ప్రోత్సాహక బహుమతి అందించారు.

– దిగిడే పవన్, చింతలమానెపల్లి

ప్రేక్షకుల మద్దతు బాగుంది



వాలీబాల్ పోటీలకు ప్రేక్షకులు భారీగా వచ్చారు. క్రీడాకారులకు ప్రేక్షకుల మద్దతే కీలకం. వారి ఆదరణ ఆనందాన్ని ఇచ్చింది. ఫైనల్ గెలిచి టోర్నీ విజేతగా నిలవడం గర్వంగా ఉంది.

– శ్రీకాంత్, తలాయి, బెజ్జూర్

'తకాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి'

ఉట్నూర్‌రూరల్: ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంల వేతనాల్లో కోత విధిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల కిరణ్ అన్నారు. బుధవారం ఏఎన్ఎంలతో కలిసి సీఐటీయూ ఆధ్వర్యంలో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాను కలిసి వినతిపత్రం అందచేశారు. పూర్తి వేతనాలు చెల్లించని వారిపై చర్యలు తీకోవాలన్నారు. ఏఎన్ఎంలు పాఠశాల్లో, వసతి గృహాల్లో స్థానికంగా ఉండి విద్యార్థులకు సేవలు అందిస్తున్నారని గుర్తుచేశారు. ఆరోగ్య బీమా, ఉద్యోగ భద్రత, గుర్తింపు కార్డులు అందించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అనిత, జంగుబాయి పాల్గొన్నారు.

రథయాత్ర విజయవంతం చేద్దాం

ఇచ్చోడ: ధర్మసమాజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న లక్ష కిలోమీటర్ల ×మా భూమి రథయాత్ర×ను విజయవంతం చేయాలని డీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి అన్నెల లక్ష్మన్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో రథయాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. ఏప్రిల్ 14న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో డైట్ మైదానంలో నిర్వహించే సభతో రథయాత్ర ప్రారంభం అవుతుందన్నారు. ప్రజా సమస్యల కోసం 33 జిల్లాలో 612 మండలాలు 12 వేల గ్రామాల్లో మూడు సంవత్సరాల మూడు నెలల పాటు కొనసాగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాజ్యాధికార జేఏసీ నాయకులు వెంకటేశ్, నరేశ్, రాజేశ్వర్, శేఖర్, రమేశ్, గంగన్న, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

పెళ్లికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న గ్రామస్తులు

ఇంద్రవెల్లి: మండలంలోని వాల్గొండ గ్రామానికి చెందిన మెస్రం మారుతి, పంచపుల బాయి దంపతుల కుమారుడు మెస్రం శేకు పెళ్లికి బుధవారం వాల్గొండ గ్రామస్తులు రూ. 23 వేల నగదు జమ చేసి అందించారు. పెళ్లి చేస్తున్న తల్లిదండ్రులకు ఆర్థిక భారం కావద్దనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు గ్రామస్తులు తెలి పారు. గ్రామపటేల్ కినక మాని కొరాష్, గ్రామపెద్దలు కినక లచ్చు పటేల్, ఆత్రం జంగు, సంతోష్, మోతిరాం, ఆత్రం శేకు, మెస్రం సోమేశ్వర్, కినక రాజేశ్వర్ పాల్గొన్నారు.